

# మనిషి

బి.వి.యతి

**మా వారు వీధి మలుపు తిరగ్గానే నా చూపు ఎదురింటివైపు తిరిగింది. అక్కడ అతను నిలబడి ఉన్నాడు. అతని చూపుల్లో వెకిలితనం లేదు. పెదాలపై చిరునవ్వూ లేదు. ఎప్పట్లాగే భావరహితంగా చూస్తున్నాడు. చప్పున తల తిప్పుకున్నాను.**

'ఏమిటీ మనిషి? ఎప్పుడూ విచిత్రంగా చూస్తూంటాడు. మేనర్‌లెస్ ఫెలో!' మనసులోనే తిట్టుకున్నాను. రోజూ అనాలోచితంగా నా తల అటు తిరగడం, అతను భావరహితమైన చూపుతో కలవడం దినచర్యలో భాగమైపోయింది. అంతకుమించి అతనిపై వేరే ఎటువంటి అభిప్రాయమూ లేదు. నల్లగా మామూలు ఎత్తుతో ఉన్న అతనిపై అభిప్రాయం ఏర్పరచుకోవాల్సిన అవసరం కూడా లేదనిపించింది.

మావారు ఒక ఫ్యాక్టరీలో సూపర్‌వైజర్‌గా పనిచేస్తున్నారు. మాకిద్దరు పిల్లలు. అంతకుముందున్న ఫ్యాక్టరీలో నష్టాలు రావడంతో పని పోయి ఈ ఊరు వచ్చి చేరాము. ఎలాగో ఒక ఫ్యాక్టరీలో మావారు ఉద్యోగం సంపాదించుకున్నారు. ఇప్పుడున్న ఇంట్లో ఒక బ్యాంక్ ఆఫీసర్ ఉన్నారు. ఎడమవైపున్న ఇంట్లో ఒక వ్యాపారస్తుడు ఉన్నాడు. వాళ్ల కుటుంబాలతో కొద్దికొద్దిగా పరిచయమైంది. వాళ్లిద్దరివీ సొంత ఇళ్లే. మేమున్నదే అద్దె ఇల్లు.

మావారు భోజనం చేస్తున్నప్పుడు చెప్పాను ఎదురింటాయన ప్రవర్తన గురించి.

"అతను ని న్నేమైనా అన్నాడా?" అడిగాడాయన.

"లేదు."

"అసహ్యమైన సైగలు చేస్తున్నాడా?"

"లేదు."

"చిలిపిగా నవ్వుతున్నాడా?"

"లేదు."

"అయితే అతను ప్రమాదకరమైన వ్యక్తేమీ కాదే! అయినా నీకు అతడు ఒక సమస్యలా ఉంటే వాళ్లావిడతో చెప్పు, ఆవిడే చూసుకుంటుంది!" నవ్వుతూ అన్నారు మావారు.

"ఆ ఇంట్లో ఆడవాళ్లెవరూ కనిపించడంలేదు. బ్రహ్మచారనుకుంటాను."

"అయితే అద్భుతమైన సలహా ఇచ్చేదా?"

"ఇవ్వండి."


"అతను నిన్ను చూస్తున్నట్టు నీకెలా తెలుస్తుంది — నువ్వు అతనివైపు చూడబట్టే కదా! నువ్వు అసలు ఆ వైపు చూడకపోతే సమస్యే లేదుకదా!" అని సంభాషణ ముగించారు మావారు.


మావారికి అతని విషయం చెప్పి పొరబాటు చేశానేమో అనిపించింది నాకు. మావారేమీ అనుమానం మనిషి కాదు కాబట్టి సరిపోయింది కానీ, లేకపోతేనా ... 'అమ్మో!' అనుకుంటూ నిద్రకుపక్రమించాను.

అర్ధరాత్రి హఠాత్తుగా మెలకువ వచ్చింది. ఎవరో మూలుగుతున్నారు బాధతో. గబుక్కున లేచి లైటు వేశాను. ఆయన బాధతో మంచంమీద మెలికలు తిరుగుతున్నారు.

"ఏమండీ! ఏమైంది?" ఒక్క ఉదుటున ఆయన్ను చేరుకున్నాను కళ్లనీళ్ల పర్యంతమైపోతూ. ఈలోగా బాబు, పాప కూడా లేచి ఏడవసాగారు.

"నొప్పి! కడుపులో నొప్పిగా ఉంది! వాణీ! నేను చచ్చిపోతున్నాను!" బాధతో మెలికలు






తిరుగుతూ అన్నారాయన.

"అయ్యో! అవేం మాటలండీ! హాస్పిటల్‌కి వెళ్దాం ఉండండి!" అంటూ గబగబా వెళ్లి పక్కింటి బ్యాంక్ మేనేజర్ వాళ్లని నిద్ర లేపాను. ఈలోగా బాబు అటువైపు ఇంటివాళ్లను కూడా లేపాడు.

అందరూ మావారి మంచం చుట్టూ గుమిగూడారు.

"ఇంతకుముందు ఎప్పుడైనా వచ్చిందా?"

"ఏయే మందులు వాడేవారు?"

"ఇప్పుడు హాస్పిటల్‌కు వెళ్లాలంటే కష్టమే!"

"హాస్పిటల్ అరమైలు దూరంలో ఉంది. ఇంత రాత్రిపూట రిక్షాలు గానీ, ఆటోలు గానీ దొరకవు!"

"పొద్దున్న వరకూ ఓపికపడితే చూడొచ్చు!"

— వచ్చి వాళ్లందరూ తలోమాటా అంటున్నారు.

నాకు నోటివెంట మాటలు రావడంలేదు. కాళ్లనుండి బయలుదేరిన వణుకు గుండెల వరకూ పాకి గుబులు పుట్టిస్తోంది. ఆయన ఇంకా బాధతో మెలికలు తిరుగుతున్నారు.

"ఆటో తీసుకొచ్చాను, ఆయన్ని తీసుకురండి!"

ఆ మాటలకు చివుక్కున తలెత్తి చూశాను. ఎదురింటి వ్యక్తి నిలబడి ఉన్నాడు. అతనెప్పుడు వచ్చాడో నేను గమనించలేదు. పరిస్థితి గమనించి అతను వెళ్లి ఆటో తీసుకువచ్చాడు.

నెమ్మదిగా మావారిని నడిపించుకుంటూ ఆటోలోకి చేర్చాడు. ఆటోలోకి ఆయన్ని చేర్చగానే చుట్టుపక్కల వాళ్లు నెమ్మదిగా జారుకున్నారు. నేను, పిల్లలు, అతను మాత్రమే మిగిలారు.

నేను దుఃఖంలోనుంచి కొద్దిగా తేరుకున్నాను. కర్తవ్యం గుర్తొచ్చింది. పిల్లల్ని ఇంట్లోకి పంపి ఆటో ఎక్కి కూర్చున్నాను. మావారికి ఇంకొకవైపు అతను కూర్చున్నాడు. ఆటో బయలుద్దేరింది.

అరగంట తర్వాత తిరిగి ఆయన్ని ఇంటికి తీసుకువచ్చాం. డాక్టరు చెప్పిన మాటలు చెవుల్లో హోరెత్తిపోతున్నాయి.

"ఈయనకి అపెండిసైటిస్. ఇరవై నాలుగు గంటల కడుపు నొప్పి. ఇంకొన్ని గంటల్లో ఆపరేషన్ చేయాలి. నెల్లూరు తీసుకెళ్లండి. ఎంత త్వరగా అయితే అంత త్వరగా తీసుకెళ్లండి. లేకపోతే బతకరు! ఆపరేషన్‌కి మూడు నాలుగు వేలు కావచ్చు!"

"అమ్మా! నొప్పి! వాణీ! సేవ్ మి వాణీ!" దీనంగా అరుస్తున్నారాయన.

"నెల్లూరు తీసుకెళ్లడం మంచిదండీ! మీదగ్గర డబ్బెంత ఉంది?" అతను అడిగాడు.

"నా దగ్గర మూడొందలు మాత్రమే ఉంది. మావారికీమధ్యనే పని దొరికింది!" క్లుప్తంగా చెప్పాను.

నా చెవుల వైపు, మెడ వైపు చూశాడతను. చెవులకి రోల్డ్ గోల్డ్ కమ్మలు, మెడలో పసుపుతాడు కనిపించాయి కాబోలు, గిరుక్కున తిరిగి వెళ్లిపోయాడు.

పది నిమిషాల తర్వాత తిరిగి వచ్చాడు. పక్కింటివాళ్లేమైనా సహాయం చేస్తారేమో నని అడిగాను. చెరి రెండొందలు ఇస్తామన్నారు. నేనే వద్దని చెప్పి వచ్చేశాను.

'డబ్బు కోసం గడ్డి తినే రోజులివి. ఆస్తి కోసం అన్నదమ్ములు నరుక్కునే రోజులు. ఎవడో అనామకుడు పక్కింటివాడి కోసం వేలు ఖర్చు పెట్టే దమ్ము (దయ అనాలేమో!) ఎవరికుంటుంది?' విరక్తిగా నవ్వుకున్నాను.

"నా దగ్గర వెయ్యి రూపాయలుంది. నే నొక నిరుద్యోగిని. అయినా పరవాలేదు. ముందు హాస్పిటల్‌లో చేర్పిద్దాం. తర్వాత డబ్బులు అడ్జెస్ట్ చేద్దాం!" అన్నాడతను.

నా నోటివెంట మాటలు రావడంలేదు. 'ఎవరితను? నా అన్నా, తమ్ముడా? బంధువా, ప్రియుడా?' నేను చేష్టలుడిగి చూస్తూండగానే అతను టాక్సీ తీసుకొచ్చాడు.

పిల్లలతో సహా టాక్సీ ఎక్కాను. నెల్లూరులో మావారికి ఆపరేషన్ జరిగింది. మావారు కోలుకున్నారు. హాస్పిటల్ నుండి డిశ్చార్జి అయ్యే రోజు ఎవరిని బతిమాలాడాడో, ఎవరి కాళ్లు పట్టుకున్నాడో కానీ బిల్లు మొత్తం చెల్లించి మమ్మల్ని ఇంటికి చేర్చాడు!

మావారు అతని చేతులు పట్టుకుని కృతజ్ఞతలు చెబుతున్నప్పుడు అతను ఇబ్బందిగా ఫీలయ్యాడు పొగడ్తలు ఇష్టం లేనట్టు.

"మొత్తం ఖర్చు ఎంతయిందో చెప్పండి, నిదానంగా, తీర్చుకుంటాను!" అని మావారు అంటే, "మీ దగ్గర డబ్బులున్నప్పుడు కొద్ది కొద్దిగా ఇవ్వండి! ఇవ్వకపోయినా పరవాలేదు. ఆ డబ్బంతా నా ఫ్రెండ్స్ దగ్గర తెచ్చిందే!" అన్నాడతను.

మావారు బాత్‌రూమ్‌లో ఉన్నప్పుడు అడిగానతన్ని — "మీరు ఇంత సహాయం మాకెందుకు చేశారు?" అని. అతనిలో ఏదో స్వార్థం ఉందని నా అనుమానం.

"మనిషిని కాబట్టి."

నా కళ్లు నీటితో నిండాయి కృతజ్ఞతా సూచకంగా.

ఇప్పుడు మావారు ఆఫీసుకు వెళ్తున్నారు. నేను తలతిప్పి చూస్తే ఎదురుగా అతను కనిపిస్తున్నాడు ఎప్పటిలాగే భావరహితంగా చూస్తూ.

అతన్ని చూసి పలకరింపుగా నవ్వాను నేను. అతను నవ్వడని నాకు తెలుసు.

పెదాలపై నవ్వుని అతికించుకుని తిరిగే బండరాతి హృదయం ఉన్న మనుషులకంటే, ఇతనే ఎన్నో రెట్లు మేలని నాకు తెలుసు.

అందుకే ప్రతిరోజూ నా చిరునవ్వుతో అతనిలోని మనిషికి నా అంజలి ఘటిస్తూంటాను.

★



తెలీదు

భార్య భర్తతో : (కోపంగా) మిమ్మల్ని పెళ్లి చేసుకున్ననాటికి నాకు బుద్ధిలేక చేసుకున్నాను.

భర్త : ఇందులో నా తప్పేం లేదు. అప్పటికి నీ సంగతి నాకు తెలీదు.